క్లుప్తంగా

ఇంటర్న్‌షిప్‌పై ముగిసిన శిక్షణ



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఎల్ఎమ్మెస్‌పై శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఇంటర్న్‌షిప్‌పై అధ్యాపకులు సతీష్‌కుమార్, రవీంద్రనాథ్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి విజయ వినోద్‌కుమార్ అవగాహన కల్పించారు. అధ్యాపకులు సువర్ణ, పద్మావతి, ప్రిన్సిపల్ గిరి, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేయడం తగదు



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి, తదితరులు

నెల్లూరు(బారకాసు): ఏళ్ల తరబడి వివాదంలో ఉన్న విషయాన్ని విస్మరించి వినియోగదారులు భోజనం చేస్తున్న సమయంలో దాడులు చేసి.. భయభ్రాంతులకు గురిచేయడం తగదని హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. విషయాన్ని రాష్ట్ర అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఇలాంటి ఘటనలతో వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని హోటళ్ల యజమానులతో చర్చించనున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరతామని చెప్పారు. సమావేశంలో హోటల్ యజమాని సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

28, 29న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్



మాట్లాడుతున్న భిక్షాలు

నెల్లూరు (టౌన్): జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 28, 29న నిర్వహించనున్నామని డిప్యూటీ డీఈఓ భిక్షాలు పేర్కొన్నారు. పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కమిటీల కన్వీనర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేసేందుకు 14 కమిటీలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. మండల స్థాయిలో ఎంపికైన ఐదు ప్రాజెక్ట్‌లను జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించనున్నారని చెప్పారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో 190 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించనున్నారని వివరించారు. ఆయా ప్రాజెక్ట్‌లు నాణ్యత, కొత్తదనంతో ఉండాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ల్యాప్‌టాప్ చోరీ

నెల్లూరు(క్రైమ్): ల్యాప్‌టాప్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సప్తగిరి కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు మినీబైపాస్‌లోని శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తన ఇంట్లోని హాల్లో ల్యాప్‌టాప్‌లో సోమవారం పనిచేస్తుండగా ఫోన్ రావడంతో బెడ్‌రూమ్‌లోకి వెళ్లారు. అనంతరం వచ్చేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వారిద్దరూ రాజకీయాల్లో అట్టర్ ఫ్లాప్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాజకీయాల్లో అట్టర్ ఫ్లాపైన నారా లోకేష్, పవన్ కల్యాణ్ మరోసారి బయల్దేరారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. నగరంలోని 47వ డివిజన్లో గల నారాయణరావుపేట, అగ్నిపేట, రాజేంద్రనగర్, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు పాదయాత్ర చేసిన ప్రతి ఒక్కరూ సీఎం పదవిని చేపట్టారని గుర్తుచేశారు. అయితే నారా లోకేష్ నాలుగు వేల కిలోమీటర్ల మేర పాదయాత్రను చేపట్టినా టీడీపీకి డిపాజిట్లు కూడా దక్కవని చెప్పారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు తిరిగినా అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. ముందు నియోజకవర్గంలో గెలవాలని లోకేష్‌కు సూచించారు. మరొకరు ఒక లారీని తీసుకొచ్చి ఇదే వారాహీ అని.. దీనిపైనే యుద్ధమంటూ ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ డైలాగులు సినిమాల్లో బాగుంటాయని, నిజ జీవితంలో పనికిరావనే విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండ విజయాన్ని సాధించి.. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ రామకృష్ణ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువను తెలుసుకుందాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న వెంకటనారాయణమ్మ



జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో..



జెడ్పీ కార్యాలయంలో..

నెల్లూరు(అర్బన్): ఓటు విలువను తెలుసుకొని.. మంచి నాయకుడ్ని ఎన్నుకోవాలని డీఆర్వో వెంకటనారాయణమ్మ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటు హక్కు వినియోగంపై ఉద్యోగులతో ప్రతిజ్ఞను కలెక్టరేట్లో బుధవారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మంచి నాయకుడ్ని ఎన్నుకుంటే దేశం బాగుపడుతుందని, ప్రతి ఒక్కరూ ఓటేయాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఏఓ షఫీమాలిక్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు జోజీ, రాంబాబు, రమణారెడ్డి, ఫాతిమున్నీసా, శ్రావణ్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

• మినీబైపాస్‌లోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వెంకటేశ్వర్లు, అధ్యాపకుడు వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(పొగతోట): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జెడ్పీ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందితో సీఈఓ చిరంజీవి ప్రతిజ్ఞ చేయించారు.

28 నుంచి పురాతన నాణేల ప్రదర్శన



నెల్లూరు రూరల్: ముత్తుకూరు రోడ్డు పార్థసారథినగర్‌లోని సిల్వర్ ఓక్స్ స్కూల్లో పురాతన నాణేలు, అరుదైన పాత కరెన్సీ, తదితరాలను ఈ నెల 28, 29న ప్రదర్శించనున్నామని పాఠశాల డైరెక్టర్లు షణ్ముఖచారి, వెంకటాద్రి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పాఠశాలలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనను తిలకించేందుకు వీలుగా రాకపోకల వసతిని కల్పిస్తామని, దీనికిగానూ తమకు ముందుగా సమాచారమివ్వాలని కోరారు. విజయవాడకు చెందిన న్యూమిస్మాటిక్స్ అండ్ ఫిలాటెలిక్ అసోసియేషన్ సభ్యుడు శ్రీధర్, వైస్ ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి 29న సన్మానం

నెల్లూరు(బృందావనం): నగరంలో వివిధ కార్యక్రమాలకు తోడ్పాటునందిస్తున్న పలువుర్ని పురమందిరంలో ఈ నెల 29న సత్కరించనున్నామని ఏ ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిర ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. రాధాకృష్ణ, అమానుల్లాఖాన్, మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను వసూలు చేయాలి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: వాణిజ్య ప్రకటనలకు సంబంధించిన పన్ను బకాయిలను వేగవంతంగా వసూలు చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 2016 నుంచి ప్రకటనల పన్నుల బకాయిలను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కోర్టు కేసుల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్లపై భవన నిర్మాణ సామాగ్రిని ఉంచితే వారికి జరిమానా విధించాలని సూచించారు. ప్రకటన బోర్డులు, భారీ హోర్డింగుల ఏర్పాటులో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు.

5న అంగరంగ వైభవంగా నగరోత్సవం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న చలపతిరావు, తదితరులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వేదగిరి లక్ష్మీనరసింహస్వామి నగరోత్సవాన్ని ఫిబ్రవరి ఐదున అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్టోన్‌హౌస్‌పేటలోని డీసీఎమ్మెస్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నవాబుపేటలోని ఏసీ సుబ్బారెడ్డి జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ పాత రైస్‌మిల్లు ఆవరణలో స్వామివారు ఆశీనులవుతారని చెప్పారు. స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఆహ్వానించామని చెప్పారు. తన పదవీ కాలాన్ని పొడిగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలను తెలియజేశారు. వేదగిరి లక్ష్మీనరసింహస్వామికి వ్యాసపూర్ణిమ నగరోత్సవాన్ని నాలుగేళ్లుగా నిర్వహించే భాగాన్ని తనకు కల్పించిన సీఎంకు కృతజ్ఞతలను తెలియజేశారు. డీసీఎమ్మెస్ సభ్యుడు ఖిల్జీ సలీమ్, బీఎం వెంకటస్వామి, నరసింహకొండ దేవస్థాన అధికారి వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. 24వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనను మేయర్ స్రవంతితో కలిసి బుధవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్ శాంతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీను, నేతలు అజయ్, హృదయ్‌కుమార్, భారతమ్మ, మస్తానయ్య, మల్లికార్జున్, శశిధర్‌రెడ్డి, రాఘవేంద్ర, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు.. వినియోగించే వారిపై కఠిన చర్యలు చేపట్టేందుకు కార్పొరేషన్ అధికారులు రంగం సిద్ధం చేశారు. కమిషనర్ హరిత ఆదేశాల మేరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఆధ్వర్యంలో దాడులు చేయనున్నారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ విక్రయాలతో పాటు వినియోగించకూడదు. కార్పొరేషన్ పరిధిలోని 54 డివిజన్లలో శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలతో కలిపి 29 బృందాలతో దాడులు చేయనున్నారు.

ప్లాస్టిక్ నిషేధ ప్రకటనలను ఏర్పాటు చేయాలి

నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రకటనలను ప్రతి దుకాణంలో ప్రదర్శించాలని కమిషనర్ హరిత బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 15 రోజుల్లోపు నోటీసులను దుకాణాల్లో ప్రదర్శించాలని తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను ఎవరైనా వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సీఎం కప్ జిల్లా స్థాయి జట్ల ఎంపికలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొనే జిల్లా ఫుట్‌బాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్ మహిళా, పురుషుల జట్లను బుధవారం ఎంపిక చేశారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కార్యక్రమాన్ని సెట్నెల్, డీఎస్ఏ సీఈఓ పుల్లయ్య, చీఫ్ కోచ్ యతిరాజ్ ప్రారంభించారు.

వేధింపుల ఘటనలపై కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేసిన భర్త, అత్తింటి వారిపై దిశ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వీఎమ్మార్‌నగర్‌కు చెందిన రవీంద్రబాబు తనకు తెలిసిన వారి వద్ద అప్పులు చేసి తిరిగి చెల్లించేవారు కాదు. దీంతో అప్పులిచ్చిన వారు భార్య మాధవిపై ఒత్తిడి తేసాగారు. ఈ క్రమంలో కొంతకాలంగా రవీంద్రబాబు అతని కుటుంబసభ్యులు అదనపు కట్నం కోసం ఆమెను ఇబ్బందులకు గురిచేయసాగారు. దీంతో విసిగిపోయిన ఆమె భర్త, అత్తింటి వేధింపులపై దిశ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేసిన భర్తపై దిశ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. సుబేదార్‌పేటకు చెందిన జరీనాబాను, అసద్ షరీఫ్ దంపతులు ఉద్యోగ రీత్యా ఖతార్‌లో ఉండేవారు. ఆ సమయంలో భార్యకు ఆహారాన్ని సక్రమంగా పెట్టకుండా.. అదనపు కట్నం కోసం వేధించేవారు. నెల్లూరొచ్చినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. కుటుంబసభ్యులతో కలిసి ఆమెను మరింత వేధింపులకు గురిచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• వ్యసనాలకు బానిసై భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. హబీబుల్లాపేటకు చెందిన విన్‌బాబు, సుమలతకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. మద్యం, ఇతర వ్యసనాలకు బానిసైన ఆయన పనులకు వెళ్లడం మానేశారు. దీంతో కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. భార్య, కుమారుడ్ని పట్టించుకోకుండా నిత్యం వేధించసాగారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపులపై విచారణ

నెల్లూరు(టౌన్): ఓవెల్ స్కూల్లో బాలికపై జరిగిన లైంగిక వేధింపులపై రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మంగళవారం సాయంత్రం విచారణ జరిపారు. ఈ విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ పార్వతి, టెట్ జాయింట్ డైరెక్టర్ మేరీ చంద్రిక, ఆర్జేడీ సుబ్బారావు స్కూల్‌కు వెళ్లి యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారించారు. బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలను సేకరించారని సమాచారం. అయితే ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులు గోప్యంగా ఉంచారు. గతేడాది నవంబర్ రెండో వారంలో ఓవెల్ సూల్లో నాలుగో తరగతి చదువుతున్న బాలికపై అక్కడ పనిచేస్తున్న పీఆర్వో బ్రహ్మయ్య లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. దీనిపై పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. విచారించిన విద్యాశాఖ అధికారులు ప్రాథమిక స్కూల్ గుర్తింపును తొలుత రద్దు చేశారు. అయితే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గుర్తింపును పునరుద్ధరించారు.

పీసీఆర్ ఎస్సై సస్పెన్షన్

నెల్లూరు(క్రైమ్): వివిధ ఆరోపణల నేపథ్యంలో వేదాయపాళెం ఎస్సైను సస్పెండ్ చేసి 24 గంటలు గడవక ముందే విధుల్లో అలసత్వం వహించిన పోలీస్ కంట్రోల్ రూమ్ (పీసీఆర్) ఎస్సై జగన్మోహన్‌రావుపై సస్పెన్షన్ వేటేస్తూ ఎస్పీ విజయారావు ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. విధుల్లో అలసత్వం, ముందస్తు సమాచారమివ్వకుండా విధులకు గైర్హాజరావడం, రికార్డులు, సీసీ కెమెరాల మానిటరింగ్ విధుల్లో అలసత్వం, అధికారులు పిలిచినా స్పందించకపోవడంపై గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమవర్మకు అధికారులు నివేదికను అందజేశారు. ఆయన ఆదేశాల మేరకు సదరు ఎస్సైను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

గాయపడిన వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. సుబేదార్‌పేటలో నివాసం ఉంటున్న హరనాథ్‌బాబు (75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నెల 11వ తేదీ తెల్లవారుజామున హరనాథ్‌బాబు మరుగుదొడ్డికి వెళ్తుండగా కాలుజారి కిందపడి గాయపడ్డారు. చికిత్స నిమిత్తం కిమ్స్ హాస్పిటల్‌కు ఆయన్ను భార్య, కుమారుడు, సమీప బంధువు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైలోని విజయ హాస్పిటల్లో ఈ నెల 16న చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆయన మృతి చెందారు. ఈ మేరకు సమీప బంధువు దినేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

నెల్లూరు(సెంట్రల్): రైల్వే ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టనున్నామని చీఫ్ కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఆర్కే శర్మ పేర్కొన్నారు. నెల్లూరు రైల్వేస్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసిన అనంతరం అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. రైల్వే సేఫ్టీతో పాటు ప్రయాణికుల భద్రత ఎంతో ముఖ్యమని తెలిపారు. రైల్వేస్టేషన్లో అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా చూడాలని సూచించారు. రైళ్లలో ప్రయాణించే సమయంలో ఏదైనా అవసరమైతే తక్షణ సాయం చేసేలా అధికారులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. అనంతరం రైల్వే పోలీస్ కార్యాలయాలను పరిశీలించారు.

ముగ్గురు ఖైదీల విడుదల నేడు..?


నెల్లూరు(క్రైమ్): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా జైళ్లలో జీవిత ఖైదు కాని ఖైదీల విడుదలకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్ర కారాగారం నుంచి ముగ్గురు నాన్‌లైఫర్లు గురువారం విడుదలయ్యే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అందాల్సి ఉందని జిల్లా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ రాజేశ్వరరావు పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం


నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యంపై నవాబుపేట పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటేశ్వరపురంలో నివాసం ఉంటున్న మస్తానమ్మ కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి నుంచి సోమవారం ఆమె అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు తల్లి జహీరాబీ ఫిర్యాదు చేశారు.

ముువ్వన్నెల పతాకానికి కళావందనం

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సింహపురి కళాకారులు తమలోని భావాలకు రూపమిస్తూ త్రివర్ణ పతాకానికి వినూత్నంగా సెల్యూట్ చేశారు. నెల్లూరు(బృందావనం):



భక్తవత్సల నగర్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థి పూజిత బొట్టు బిళ్లలతో మువ్వన్నెల పతాకానికి రూపునిచ్చారు. నాలుగంగుళాల ఎత్తు, రెండంగుళాల వెడల్పుతో 96 బొట్టుబిళ్లలను ఉపయోగించి త్రివర్ణ పతాకాన్ని తీర్చిదిద్దారు.



భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు జాతీయ పతాకానికి కళాత్మక వందనం చేశారు. క్యారెట్, ముల్లంగి, దొండకాయలు, ఉల్లిపాయ, తదితరాలతో జాతీయ పతాకాన్ని కళాత్మకంగా తీర్చిదిద్దారు.



హరనాథపురానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు పద్మారత్నం జామాయిల్ ఆకుపై కార్వింగ్‌తో జాతీయ పతాకాన్ని చేతబట్టి ముందుకు సాగుతున్న సిపాయి రూపాన్ని తీర్చిదిద్దారు.